క్లుప్తంగా

కర్నూలు ఈఓఆర్‌డీగా అనురాధ



కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల ఈఓఆర్‌డీగా కె. అనురాధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాణ్యంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేసిన ఈమె బదిలీపై కర్నూలు ఈఓఆర్‌డీగా నియమితులయ్యారు. ఇక్కడ ఈఓఆర్‌డీగా పని చేసిన జి. నాగేశ్వర్ రెడ్డి సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్లారు.

శాస్త్రీయ పద్ధతి వరి సాగులో అధిక దిగుబడి



రైతులకు మెలకువలు తెలుపుతున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు వరి పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలం పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో గ్యాప్ (జీఏపీ – గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా ఏఈఓ సిద్దు, మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది వరి పొల్లాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి పంట సాగు విధానంతో పాటు పెట్టు బడిలేని ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్‌ఎఫ్ – జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్)పై రైతుల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు వెంకటేష్, ఈశ్వర్, సోమేశ్వరి, వీఏఏ నాయక్, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

హాకీ క్రీడలో గిరిజన విద్యార్థుల ప్రతిభ



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరీ సలోమి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 25న కర్నూలులో జరిగిన ఎంపిక పోటీల్లో ఆర్.రాధికాబాయి అండర్–17 విభాగంలో, మధుశ్రీ అండర్–14 విభాగంలో ప్రతిభ చాటారన్నారు. ఈ ఇద్దరిని ప్రిన్సిపాల్‌తో పాటు కోచ్ అశోక్‌రెడ్డి, పీడీ పద్మావతి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కర్నూలు (న్యూటౌన్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్రీయ బాల స్వాస్థ్య అధికారిణి హేమలత అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం గార్గేయపురం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పర్యావరణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పర్యావరణ కాలుష్యం ఒకటని చెప్పారు. రోజురోజుకి పెరిగిపోతున్న ఈ కాలుష్యం మనిషి జీవనానికి మహావిపత్తుగా మారి అనేక సవాళ్లను విసురుతుందన్నారు. అనంతరం పర్యావరణ కాలుష్యం రకాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, రుగ్మతలు, కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వ్యాసర రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమరయోధులను స్మరించుకోవాలి

ఓర్వకల్లు: దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవాలని ఎంఈఓ–2 సునందాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు జెడ్పీ హై స్కూల్‌లో మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు సేకరించిన మట్టిని కలశంలో తీసుకొని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం మట్టి కలశాన్ని ఎంఈఓ–1కు అప్పగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రాణేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నైట్ వాచ్‌మెన్ మృతి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించే జమ్మన్న (45) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. ఆ సమయంలో గుండెపోటు రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం చేయించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పీహెచ్‌సీ నైట్ వాచ్‌మెన్ మృతిపై డాక్టర్లు మిథున్‌కుమార్‌రెడ్డి, సునీత, ప్రసాద్‌రెడ్డి, వైద్య అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. మృతుడికి భార్య ఉసేనమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

భూ వివాదాలకు చెక్ !



నెరవాడలో రోవర్‌తో కొలతలు వేస్తున్న రెవెన్యూ అధికారులు



కొలురులో హద్దురాళ్లు దించుకున్న దృశ్యం

- ముమ్మరంగా భూ రీసర్వే
- రోజూ 70 ఎకరాల్లో కొలతలు
- పాణ్యం మండలంలో ఇప్పటికే ఆరు గ్రామాల్లో సర్వే పూర్తి
- యజమానులకు భూ హక్కు పత్రాల పంపిణీ

పాణ్యం: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకాన్ని ప్రవేశపట్టింది. ఈ పథకం కింద గ్రామాల్లో భూ రీసర్వే చేపట్టింది. రైతుల పొలాలకు భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమం పాణ్యం మండలంలో శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల పాతి రైతులకు భూ హక్కు పత్రాలు సైతం పంపిణీ చేస్తున్నారు.

వివాదాలు, మోసాలకు చెక్

బ్రిటిష్ కాలంలో 1905 నుంచి 1930 వరకు గ్రామాల్లో వ్యవసాయ భూములను రీసర్వే చేసి ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులను రూపొందించారు. ఆ తర్వాత ఇప్పటి వరకు భూముల రీసర్వే జరగలేదు. అప్పటి రికార్డుల ఆధారంగానే రైతులకు భూహక్కు కల్పిస్తున్నారు. భూముల రీసర్వే జరిగి దాదాపు వందేళ్లు కావడంతో ఎన్నో మార్పులు చోటు చేసుకొని, భూ వివాదాలు ఏటా పెరిగిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం 2020లో రీసర్వేకు శ్రీకారం చుట్టింది. అధికారులు సర్వే చేసిన ప్రతి భూమికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. ఆ సంఖ్యను మరెక్కడా వినియోగించరు. ఈ విశిష్ట సంఖ్య రైతు ఆధార్, మొబైల్ నంబర్లతో అనుసంధానమై ఉంటుంది. ఎవరైనా మార్చాలని చూసినా వారి హక్కు దారుడి మొబైల్‌కు మెస్సేజ్ వెళ్తుంది. దీంతో మోసాన్ని నివారించేందుకు వీలు కలుగుతుంది.



గోరుకల్లులో భూ హక్కు పత్రాలు అందిస్తున్న దృశ్యం

ఆరు గ్రామాల్లో పూర్తయిన సర్వే

మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద కొత్తూరు గ్రామాన్ని ఎంపిక చేసి రీసర్వే పూర్తి చేశారు. విజయవంతం కావడంతో రెండో విడతలో తమ్మరాజుపల్లె, చిలకల, గోరుకల్లు , గోనవరం, కొలురు, కొండజుటూరు, నెరవాడ గ్రామాల్లో ప్రారంభించారు. ఇందులో కొండజుటూరు, నెరవాడ మినహా మిగతా అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయింది.

రోజు 70 ఎకరాల రీ సర్వే

ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే వేగంగా జరుగుతుంది. ప్రతి రోజు 70 ఎకరాల్లో సర్వే చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఆరుగురు రెవెన్యూ సిబ్బంది పాల్గొంటున్నారు. రోవర్ మిషన్‌తో కొలతలు వేస్తున్నారు. తర్వాత హద్దులు గీసి రాళ్ల పాతుతున్నారు. కొలతల సమయంలో ఏమైనా సమస్యలు ఉంటే నోటీసు ఇచ్చి 30 రోజుల్లో సమస్య పరిష్కరిస్తున్నాం.

– మహేశ్వరరెడ్డి,రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్

సర్వే పూర్తయిన గ్రామాలు

గ్రామంపేరు	ఖాతాలు	విస్తీర్ణం	రాళ్లు
కొత్తూరు	670	1130.	1000
తమ్మరాజుపల్లె	545	2652.01	1526
చిలకల	1053	2651.32	1528
గోరుకల్లు	332	2925.5	1167
గోనవరం	950	2012.58	1256
కొలురు	645	2349.33	1375

పైసా ఖర్చు లేకుండా సర్వే



ప్రభుత్వం భూ రీ సర్వే ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతుంది. భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. పైసా ఖర్చు లేకుండా సర్వే చేసి హద్దులు చూపిస్తున్నారు. ఇటీవలే నాకున్న 11 ఎకరాల భూమిని కొలిచి హద్దురాళ్లు పాతి వెళ్లారు. రూపాయి కూడా ఖర్చు కాలేదు. మేము సొంతంగా చేయించుకోవాలంటే చాలా ఖర్చు అయ్యేది.

– గుమ్మసాని, క్రిష్టారెడ్డి కొత్తూరు గ్రామం

భూ సమస్యలకు పరిష్కారం



గ్రామంలో రీ సర్వే ప్రారంభమతున్న తరుణంలో ముందుగా గ్రామ సభ నిర్వహించి అధికారులు రీ సర్వే వలన కలిగే ప్రయోజనాలు గురించి చెబుతున్నారు. తర్వాత రోజువారి సర్వే నంబర్లకు సంబధించి రైతులకు ఒక రోజు ముందుగా నోటీలు ఇచ్చి వారి సమక్షంలోనే కొలతలు వేస్తున్నారు. దీని వల్ల ఏళ్ల నాటి భూ సరిహద్దు సమస్యలకు పరిష్కారం దొరుకుంది.

– సద్దల సుజిత్‌రెడ్డి, సర్పంచ్ కొండజుటూరు

పూర్తయిన గ్రామాలకు ఇటీవలే ప్రభుత్వం గెజిట్ సర్టిఫికెట్ విడుదల చేసింది. దీంతో ఆయా గ్రామాల్లో భూ క్రయ విక్రయాలు మరింత సులభతరం కానున్నాయి.

సానుభూతి కోసమే టీడీపీ దీక్షలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు జైలుకెళ్లడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నేతలు చేస్తున్న దీక్షలు ప్రజల నుంచి సానుభూతి కోసమేనని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విమర్శించారు. వారు ఇలాంటి దీక్షలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మరన్నారు. ఎందుకంటే బాబుబాగోతం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. బోగస్ కంపెనీల పేరుతో వందల కోట్లు చంద్రబాబు కాజేశారన్నారు. శుక్రవారం కోడుమూరు మండల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని చెప్పారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం సబ్సిడీపై అందజేస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, జెడ్పీటీసీ గిరిజోను, డైరెక్టర్ ఇమ్మానేయులు, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, సర్పంచ బాలక్రిష్ణ, నేతలు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బలరాం, మధు, సుంకన్న, పాపిరెడ్డి, రమణారెడ్డి, అయ్యప్ప, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ

కర్నూలు (న్యూటౌన్): గుండెపోటుతో మృతి చెందిన ఆర్‌కే దుద్యాల గ్రామానికి చెందిన వార్డు మెంబర్ బి. ఏసేపుకు వైఎస్ఆర్ బీమా కింద రూ. 2లక్షల చెక్కు మంజూరైంది. దీనిని శుక్రవారం ఏసేపు భార్య చంద్రమ్మకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆయన నివాసంలో అందజేశారు. కష్టకాలంలో బీమా సాయం అందడంపై ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

క్యాష్‌లెస్ సేవలు వినియోగించుకోండి

కోడుమూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ కోడుమూరులో ప్రారంభించిన క్యాష్‌లెస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచు భాగ్యరత్న కోరారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయానికి మంజూరైన క్యాష్‌లెస్ పరికరాలను ఈఓ అజయ్‌భాస్కర్ సర్పంచు భాగ్యరత్న చేతుల మీదుగా సిబ్బందికి అందజేశారు.

ఎయిర్ పోర్టుకు బెస్ట్ టూరిస్టు అవార్డు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న విద్యాసాగర్

ఓర్వకల్లు: ఓర్వకల్లు సమీపంలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్ పోర్టుకు బెస్ట్ టూరిస్టు ఫ్రెండ్లీ ఎయిర్ పోర్టు అవార్డు లభించినట్లు ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వెల్లడించారు. అందరి సహకారంతో ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు రాష్ట్రంలోనే మంచి పేరు తీసుకొస్తామన్నారు.

ఈ తాండ్రపాడులో చురుగ్గా అభివృద్ధి పనులు



ఈ తాండ్రపాడు ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి



రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఈ తాండ్రపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.40లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గొందిపర్ల రోడ్డులో రూ.20లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అదేవిధంగా ఇందిరమ్మ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టిన డ్రైనేజీ కాల్వ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కర్నూలు రూరల్ పంచాయతీరాజ్ ఏఈ రవిమోహన్‌రెడ్డి శుక్ర వారం ఆ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, అలాగే నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంట్రాక్టర్ సద్దాం హుస్సేన్‌కు సూచించారు. ఇప్పటికే సీసీ రోడ్డు పూర్తయిందని, డ్రైనేజీ కాల్వ పనులు జరుతున్నాయని ఏఈ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



కరుణాకర్‌రెడ్డి, పాణ్యం



శివరామిరెడ్డి, గడివేముల




చెన్నారెడ్డి, ఓర్వకల్లు




అబేలు, గూడూరు నగర పంచాయతీ



రమేష్ నాయిడు, కోడుమూరు



మహబూబ్‌బాషా, కర్నూలురూరల్



సోమశేఖరరెడ్డి, సి. బెళగల్

కోడుమూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి కోడుమూరు మండల అధ్యక్షుడిగా రమేష్‌నాయుడు, కర్నూలు రూరల్ అధ్యక్షుడిగా కొట్టముల్ల మహబూబ్‌బాషా, గూడూరు నగర పంచాయతీ అధ్యక్షుడిగా అబేలు, సి.బెళగల్ మండల అధ్యక్షుడిగా సోమశేఖరరెడ్డిని నియమించింది. మండలాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్తామని వారు తెలిపారు.

పాణ్యం: పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి పాణ్యం మండల అధ్యక్షుడిగా కామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ఓర్వకల్లు మండలానికి చెన్నారెడ్డి, కల్లూరు మండలానికి కె. పెద్ద ఈశ్వరయ్య, గడివేముల మండలానికి యేలంపల్లె శివరామిరెడ్డిని అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన వారు మండలాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం సూచించింది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రబీసాగుకు సబ్సిడీపై శనగ విత్తనాలు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- పంపిణీ కార్యక్రమంలోఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. విత్తనాల కోసం రైతులు ఇబ్బంది పడకూడదని వాటిని సబ్సిడీపై అందజేస్తున్నామని చెప్పారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పప్పుశనగ రాయితీ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఏడాది రైతులకు సకాలంలో 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందజేస్తున్న ప్రభుత్వం తమదన్నారు. గతంలో ఐదు ఎకరాలకు పైగా ఉన్న రైతుకు 125 కిలోలు మాత్రమే ఇచ్చేవారని, ఈ ఏడాది 200 కిలోల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడీఏ శాలురెడ్డి మాట్లాడుతూ మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాలకు కలిపి మొత్తం 3,450 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు చేశామన్నారు. ఇప్పటి వరకు 650 క్వింటాళ్ల వరకు రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. భూమిలో పదును ఆరిపోకముందే విత్తనాలు అందజేస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఈ–క్రాప్‌లో సూపర్‌చెక్ తప్పనిసరి

కల్లూరు: ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియలో పారదర్శకత పెంపొందించేందుకు సూపర్ చెక్ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం చిన్నటేకూరు, పుసులూరు, రెమడూరు గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేసి ఎంత విస్తీర్ణంలో పంటలను సాగు చేశారని పరిశీలించారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారమే క్షేత్రస్థాయిలో పంటలు ఉన్నాయా? లేదా అని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ వ్యవసాధికారి (ఏడీఏ) సాలురెడ్డి, ఏఓ శ్రీనివాసరెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి

పాణ్యం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలిక కళాశాల, పాఠశాల, మినీ గురుకులాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీ సలోమీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బిలకలగూడూరులో గడప గడపకు..

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.17,280 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు. పట్టుబడిన వారిలో గూడూరుకు చెందిన బొజుగు హనుమన్న, బొజుగు ఏసేపు, దైరిపోగు చిన్న మద్దిలేటి, మల్లామపు యేసన్న, సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామానికి చెందిన సందేపోగు దేవవరం ఉన్నారని వెల్లడించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

సి.బెళగల్: బురాన్‌దొడ్డి గ్రామంలో కర్ణాటక మద్యం పట్టుబడింది. సమాచారం మేరకు శుక్రవారం గ్రామంలో సోదాలు నిర్వహిస్తుండగా తిరుమలనాయుడు అనే వ్యక్తి కర్ణాటకకు చెందిన 38 మద్యం ప్యాకెట్లు విక్రయిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీరయ్య వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్నూలు (న్యూటౌన్) : మండల పరిధిలోని మిలటరీ కాలనీ నుంచి జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజ్, సూదిరెడ్డిపల్లె, వెంకాయపల్లె గ్రామాల పరిధిలోని వెంచర్లకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కర్నూలు రూరల్ ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయ శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నుంచి గార్గేయపురం వరకు రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం మిలటరీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో కాలేజ్ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు: ప్రతి ఒకరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కర్నూలు క్షేత్ర ప్రచార, సమాచార అధికారి నాగసాయి సూర్యపరవాస్తు అన్నారు. శుక్రవారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత ప్రభుత్వ సమాచార, ప్రసార శాఖ కర్నూలు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థినుల ప్రతిభ

పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మేరీ సలోమీ అన్నారు. ఈ నెల 27వ తేది ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా పదవ తరగతి చదువుతున్న జె. విష్ణుప్రియ (తెలుగు వ్యాసరచన), శివలక్ష్మి (ఇంగ్లిష్ వ్యాసరచన) జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచారన్నారు. అలాగే డ్రాయింగ్ పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న యు. చరితమ్మ ప్రథమ స్థానంలో నిలిచారని, ఈ ముగ్గురి విద్యార్థినులకు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శుక్రవారం సర్టిఫికెట్లు, షీల్డ్ అందించిఅభినందించినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత

గూడూరు: కర్నూలుకు చెందిన డా.జే. అకర్మన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. రెవ.డాక్టర్ రాచపూడి 80 వ జయంతిని పురస్కరించుకొని వాటిని అందించినట్లు నిర్వాహకులు రమేష్, విజయ్‌కుమార్ తెలిపారు.

'సుంకేసుల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శుక్రవారం 6,370 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వానలకు ఇన్ ఫ్లో ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. దీంతో డ్యాం కు చెందిన ఒక గేట్‌ను మీటరు మేర ఎత్తి దిగువకు 4,446 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. డ్యాం లో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కర్నూలు (టౌన్) : ఆత్మరక్షణకు కరాటే సాధన అవసరమని కేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

- కోడుమూరు పీహెచ్‌సీలో హెల్త్ చెకప్ చేయించుకున్న ఎమ్మెల్యే సుధాకర్



కోడుమూరు పీహెచ్‌సీలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఎమ్మెల్యే శుక్రవారం కోడుమూరు పీహెచ్‌సీని సందర్శించి వైద్యులతో హెల్త్ చెకప్ చేయించుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారని చెప్పారు. వారందరికీ శనివారం నుంచి నిర్వహించే హెల్త్ క్యాంపుల్లో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైతే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స కూడా అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, వైద్యాధికారిణి పుష్పలత, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, సర్పంచు బాలక్రిష్ణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందించే వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఉలిందకొండ గ్రామంలో నేడు నిర్వహించే వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, మెడికల్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


మండలంలోని ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం కొనసాగుతోంది.

నేడు ఆలమూరులో వైద్య శిబిరం

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి, మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీత తెలిపారు. శుక్రవారం వారు ఆగ్రామంలో ఏర్పాట్లను పరిశీలించారు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం

కర్నూలు (న్యూటౌన్): ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీలోని తన కార్యాలంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. నేడు కర్నూలు మండలం గార్గేయపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పలుకుదొడ్డిలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గడివేముల: జగనన్న ఆరోగ్య సురక్షపై నేడు నిర్వహించనున్న మెడికల్ క్యాంపును విజయవంతం చేయాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, వైద్యాధికారిణి డాక్టర్ మొల్లా జబీన్ కోరారు. శుక్రవారం వారు కొరటమద్ది గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

సి.బెళగల్: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పలుకుదొడ్డి, బ్రాహ్మణదొడ్డి, సంగాల, తదితర గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆశా వర్కర్లతో కలిసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పోలకల్ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ హరిచంద్రుడు తెలిపారు. గ్రామస్తులు ఈ శిబిరంలో ఉచిత వైద్య సేవలు పొందవచ్చునని చెప్పారు.